# మాతాశిశు రక్షణలో కీలకం కిల్కారీ

- అందుబాటులోకి సరికొత్త వ్యవస్థ
- చిన్నారి చిరునవ్వు పేరిట రాష్ట్రంలో అమలు

**మామిడికుదురు:** గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్య సేవల కోసం కేంద్ర ప్రభుత్వం 'కిల్కారీ' (కిల్కారి హిందీ పదం, తెలుగులో దీన్ని చిన్నారి చిరునవ్వుగా పిలుస్తారు) వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. మతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా ఈ వ్యవస్థలను అమలు చేస్తున్నారు. దీని అమల్లో భాగంగా ఐవీఆర్ఎస్ ద్వారా ప్రతి గర్భిణి, బాలింతలను అప్రమత్తం చేస్తున్నారు. గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి డెలివరీ అయిన ఏడాది వరకు గర్భిణులకు, బాలింతలకు జాగ్రత్తలు వివరిస్తున్నారు. ఏ వారం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న సూచనలను 01244 58000 నంబర్ ద్వారా వారానికి ఒకసారి సెల్‌ఫోన్ల ద్వారా ఉచితంగా తెలుగులో తెలియజేస్తున్నారు. దీనిలో మాతా, శిశు ఆరోగ్య సేవలు, టీకాల వివరాలను ప్రధానంగా వివరిస్తున్నారు. ఈ సమాచారం వినలేని పరిస్థితి ఉంటే 14423 నంబర్‌కు కాల్ చేసి వినే అవకాశం కూడా కల్పించారు. 2016లో కేంద్ర ప్రభుత్వం ఈ సేవలను ప్రవేశ పెట్టింది. ఈ సేవలను ఇంత వరకు ఇతర రాష్ట్రాల్లో మాత్రమే అమలు చేశారు. ఇటీవల వీటిని మన రాష్ట్రంలోనూ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కాల్ ఒక టిన్నర నుంచి రెండు నిమిషాల వరకు ఉంటుంది. బిడ్డ పుట్టిన ఏడాది వరకు ఈ సందేశాలు బాలింతల ఫోన్లకు వస్తూనే ఉంటాయి. 'చేతులు పరిశుభ్రంగా లేకపోతే పిల్లలు తరచూ విరేచనాల బారిన పడతారు'. 'వయసుకు తగిన బరువు ఉండాలి', 'మానసిక ఎదుగుదలకు తీసుకోవల్సిన జాగ్రత్తలు'. 'చేతులు పరిశుభ్రంగా ఉంచుకోండి' వంటి సూచనలు అందిస్తారు.

### మొబైల్ ద్వారా సేవలందిస్తాం



మొబైల్ యాప్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు వారు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రతి నెలా సూచనలందిస్తాం. గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి ప్రతి వారం సూచనలందిస్తాం. ప్రసవం అయిన ఏడాది వరకు 72 కాల్స్ ద్వారా సూచనలు, సలహాలు అందిస్తాం. ఆశ, ఏఎన్ఎం చెప్పలేని విషయాలను కూడా కిల్కారి ద్వారా తెలియజేస్తాం. ఇది గర్భిణులకు, బాలింతలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.

– ఎం.సుమలత, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల్ల, ఆలమూరు మండలం



కిల్కారి సేవలపై శిక్షణ పొందుతున్న ఆరోగ్య, ఆశ కార్యకర్తలు

### కార్యాచరణ ఇలా...

ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు ముందుగా గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారి పూర్తి సమాచారం సేకరిస్తున్నారు. పేరు, గర్భం దాల్చిన తేదీ, మొబైల్ నంబర్, అంచనా ప్రసవం తేదీ వంటి వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. గర్భిణులకు, బాలింతలకు సమాచారం చేరవేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. వీటి ఆధారంగా చిన్నారి చిరునవ్వు సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు చెప్పే సమాధానాల ఆధారంగా ఆరోగ్య సమాచారం అందిస్తున్నారు. పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి లోపాలతో మాతృ మరణాలు సంభవిస్తున్నాయి. ఈ తరహా మరణాలను నిరోధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలో సుమారుగా 21 పీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు 10 వేల మంది గర్భిణులు, ఎనిమిది వేల మంది బాలింతలు ఉన్నారు. చిన్నారి చిరునవ్వు సేవల ద్వారా పైన పేర్కొన్న సుమారు 18 వేల మందికి స్వీయ ఆరోగ్య సేవలందుతున్నాయి.

## అనారోగ్య బాధితురాలికి రూ.20 వేల సాయం

**కొత్తపేట:** అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ వైద్యానికి మండల యువ శెట్టిబలిజ సంఘం రూ.20 వేలు సాయం అందించి ఔదార్యాన్ని చాటుకుంది. మండలంలోని గంటి పల్లిపాలేనికి చెందిన అంబటి మాణిక్యంకు నాలుగు నెలల క్రితం కాళ్ల కింద సిరలలో రక్త ప్రసరణ ఆగిపోవడంతో భీమవరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి సుమారు రూ.5 లక్షలు వెచ్చించి యాంజియోప్లాస్టి చేయించారు. అది సక్సెస్ కాక కాలు తొలగించారు. ఆ గాయం మానక ముందే మరో కాలు రక్తప్రసరణ ఆగిపోయింది. ఆ కాలుకు యాంజియోప్లాస్టి చేయించాలంటే రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని, చేయించకపోతే ఆ కాలు కూడా తొలగించాలని వైద్యులు తెలిపారు. దాంతో బాధిత మహిళ కుటుంబ సభ్యులు దాతల సాయాన్ని అర్థించారు. ఈ విషయం తెలుసుకున్న యువ శెట్టిబలిజ సంఘం సభ్యులు చలించి తమ వంతుగా రూ.20 వేలు సాయం ఆదివారం సాయంత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, గౌరవ సలహాదారు కొప్పిశెట్టి వాసు, ఖండ్రిగ ఉప సర్పంచ్ కడలి పార్థసారథి, కోశాధికారి కముజు తాతాజీ, సంయుక్త కార్యదర్శులు కడలి భీమా, జోగి మురళి తదితరులు పాల్గొన్నారు.



గంటిపల్లిపాలెంలో బాధిత మహిళకు ఆర్థిక సాయం చేస్తున్న శెట్టిబలిజ సంఘం సభ్యులు

## ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

**పి.గన్నవరం:** ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, అర్హులందరికీ సాయం అందించేందుకు గృహ సారథులు, కన్వీనర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండల జేసీఎ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు అధ్యక్షతన ముంగండ, ముంగండపాలెం, కె.ముంజవరం, కె.ఏనుగుపల్లి గ్రామాల్లో ఆదివారం గృహ సారథులు, కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. పార్టీ అధిష్టానం గృహ సారథులపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వచ్చే నెల 18 నుంచి జరగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. శిక్షణ పొందిన గృహ సారథులకు చిట్టిబాబు కిట్లు అందజేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు తోలేటి బంగారు నాయుడు, కుసుమ చంద్రకళ, శృంగవరపు లక్ష్మణ రావు, సొసైటీ చైర్మన్లు కుంపట్ల గోపి, బొడ్డు సురేష్, ఎంపీటీసీలు కొల్లే సూర్యనారాయణ, ముక్కామల భారతి, యాండ్ర విజయలక్ష్మి, పార్టీ నాయకులు దేశిరాజు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



కె.ముంజవరంలో గృహ సారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

## ఆస్పత్రిలో మృతదేహాలను సందర్శించిన ఎమ్మెల్యే

**అయినవిల్లి:** మండలంలోని నేదునూరు పెదపాలెం టి.సావరంలో ఉన్న జమ్మిచెట్టు వద్ద అమలాపురం వైపు బైక్‌పై వెళుతున్న ముగ్గురు విద్యార్థులు (స్నేహితుల)ను అమలాపురం నుంచి ముక్కామల వస్తున్న లారీ ఢీకొన్న విషయం ఆదివారం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందిన ముక్కామల నందెపుపాలెంకు చెందిన నందెపు రాజేష్ (17), కొత్తపేట మండలం అల్లపల్లిపాలెం ఖండ్రిగకు చెందిన అల్లపల్లి నాగేంద్ర(17)ల మృతదేహాలను అమలాపురం ఏరియా ఆస్పత్రిలో స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సందర్శించారు. ప్రమాదానికి కారణాలను మృతుల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఇదే ప్రమాదంలో గాయపడ్డ కొత్తపేట మండలం రాకూర్తివారిపాలేనికి చెందిన కోటిపల్లి మోహనవీరవెంకట సాయికృష్ణ(18)ను ఘటనను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

## మార్చి 3 నుంచి సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు



ఉభయ దేవేరులతో కొలువుదీరిన సత్యనారాయణస్వామి

**మామిడికుదురు:** మాకనపాలెంలో కొలువుదీరిన అనంతలక్ష్మీ, భూదేవి సమేత సత్యనారాయణ స్వామి వారి 71వ వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మార్చి 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ స్వామి వారి కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ ఆదివారం తెలిపింది. మార్చి 3వ తేదీ ఏకాదశి శుక్రవారం ఉదయం వ్రతాలు, మొక్కులు, అభిషేకాలతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఈ ఉత్సవాలు మంగళవారం వరకు అయిదు రోజుల పాటు జరుగుతాయని కమిటీ పేర్కొంది. శుక్రవారం రాత్రి 12 గంటలకు గరుడ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం, అనంతరం శ్రీస్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణం జరుగుతుందన్నారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజులు ఉదయం వ్రతాలు, మొక్కులు, అభిషేకాలు ఏర్పాటు చేశారు. ఐదు రోజులు ఐదు రకాల వాహనాలపై స్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## 80 మంది యువకుల రక్తదానం

**అమలాపురం టౌన్:** లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కత్రి సత్యనారాయణ మిల్లు ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొలిశెట్టి తాతాజీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరంలో 80 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అమలాపురం బుద్దాల నాగరత్నం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, నల్లా అజయ్ తదితరులు రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

# వేయినామాలవాడ వేంకటేశుడా..

**ఆత్రేయపురం:** గ్రామంలో వేంచేసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఎనిమిదో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, విశేష హోమం, ఎదురుకోలు ఉత్సవం, స్వామివారి కల్యాణం, గ్రామోత్సవం, నిత్యం హోమం, బలిహరణ, హారతి, తీర్థప్రసాదాలు తదితర పూజలను రమణీయంగా నిర్వహించారు. సాయంత్రం హనుమత్ వాహనోత్సవంపై స్వామి వారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం శ్రీమాన్ ఖండవల్లి సూర్యనారాయణచార్యులు, సుదర్శనం సూర్య పురుషోత్తమ సత్యసాయి, ఆలయ అర్చకులు వాడపల్లి పవన్ దీక్షితులు, వేదపండితులు వాడపల్లి జనార్దనాచార్యులు, అనంతకుమార్‌ల ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు పాల్గొని స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పాతపాటి రమణరాజు–రాజ్యలక్ష్మి దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి కల్యాణోత్సవాలను అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రమణరాజు ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు గోరింట వినయ్‌వర్మ తదితరులు పర్యవేక్షించారు.



పడమటిపాలెంలో జరిగిన వేంకటేశ్వరస్వామి కల్యాణం



ఆత్రేయపురంలో జరిగిన కల్యాణంలో పాల్గొన్న దాత రమణరాజు కుటుంబ సభ్యులు

**నేటి కార్యక్రమాలు..**

ఉదయం స్వామికి సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, చతుర్దశ కలశారాధన, విశేష పంచామృతాభిషేకం, సామూహిక లక్షకుంకుమార్చన, సాయంత్రం ఐశ్వర్యప్రాప్తికి మహాలక్ష్మి హోమం, తామరపుష్పాలతో నిర్వహిస్తారన్నారు. సింహ వాహనంపై స్వామి వారి ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ రమణరాజు తెలిపారు.

**పడమటిపాలెంలో..**

**మలికిపురం:** మండలంలోని పడమటిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది జంటలు కల్యాణంలో పాల్గొన్నాయి. అర్చకుడు బుచ్చిబాబు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఆదివారం నుంచి మంగళవారం వరకూ కల్యాణోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం అన్నసమారాధన జరుగుతుంది.

# ఆదివారం.. అమలాపురంలో సెలవు

- వ్యాపార సంఘాల నిర్ణయం
- మంగళవారం సెలవుకు స్వస్తి

**అమలాపురం టౌన్:** దాదాపుగా 1940వ దశకం నుంచి అమలాపురం పట్టణంలో మంగళవారం రోజు మార్కెట్ సెలవు అమలవుతోంది. అయితే ఇప్పుడు మారిన మార్కెట్ పరిస్థితులు, వ్యాపారుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని మెజారిటీ వ్యాపార సంఘాలు మంగళవారం సెలవు స్థానే ఆదివారం సెలవును స్వాగతిస్తున్నాయి. ఇక నుంచి ఆదివారం రోజునే సెలవు తీసుకోవాలని నిర్ణయించాయి.

ఒకప్పటి డివిజన్ కేంద్రం, ప్రస్తుతం జిల్లా కేంద్రమైన అమలాపురంలో అనేక కొనుగోళ్ల అవసరాల నిమిత్తం కోనసీమ వ్యాప్తంగా ప్రజలకు అనుబంధముంది. అమలాపురంలో మంగళవారం సెలవు దినంగా ప్రజల్లో నాటుకుపోయింది. అమలాపురంలోని రెండు చాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలో 32 రకాల వ్యాపార సంఘాలు(ట్రేడ్ యూనియన్లు) ఉన్నాయి. ఈ సంఘాల ద్వారా పట్టణంలో సుమారు 900 వ్యాపార దుకాణాలు ఉన్నాయి. ఈ 32 సంఘాల్లో రెండు వ్యాపార సంఘాలు మినహా మిగిలిన సంఘాలకు చెందిన వ్యాపారులు ఆదివారం సెలవు దినానికే మద్దతు పలుకుతున్నారు. దీంతో ఆదివారం సెలవు దినాన్ని మార్చి నెల నుంచి పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ఆ వ్యాపార సంఘాలు సంసిద్ధమవుతున్నాయి. ఇప్పటికే పట్టణంలోని ఐరన్, సిమెంట్, పెయింట్స్, హార్డ్‌వేర్ దుకాణాల వ్యాపార సంఘాలు మంగళవారం సెలవుకు స్వస్తి చెప్పి ఆదివారం సెలవును అమలు చేసుకుంటున్నాయి.



అమలాపురం కలశం సెంటర్

### మార్పుకు ఇదీ కారణం

ప్రస్తుతం సరకుల ఖరీదు కోసం స్థానిక వ్యాపారులు ఒక్క రాజమహేంద్రవరంపైనే ఆధారపడ లేదు. పైగా అందుబాటులో ఉన్న సాంకేతికతతో సరకుల ఖరీదుకి నేరుగా వెళ్లాల్సిన పని ఉండటం లేదు. దేశంలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్ కొనుగోళ్ల ద్వారా పార్శిల్ వ్యాన్‌లు నేరుగా దుకాణం దగ్గరకే వచ్చి దిగుమతి చేసి వెళుతున్నాయి. దీంతో మంగళవారం సెలవు వల్ల పూర్వం మాదిరిగా కలిసొచ్చేది ఏదీ లేదు. ఆదివారం సెలవుతో కుటుంబంతో సంతోషంగా గడిపేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఓ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆదివారం సెలవును ఇక నుంచి అమలు చేయాలని నిర్ణయం తీసుకుంటే, మరో చాంబర్ ఆయా వ్యాపారుల వెసులుబాటును బట్టి ఆదివారం సెలవు తీసుకునే స్వేచ్ఛను అదే వ్యాపారులకు వదిలేసింది.

### అసలు మంగళవారం సెలవు ఎందుకు వచ్చింది..?

బ్రిటిష్ ఇండియా పాలనలో దాదాపుగా భారత దేశమంతా ఆదివారమే సెలవు దినంగా ఉండేది. అయితే అమలాపురంలో మాత్రం మంగళవారం సెలవుగా నిర్ణయించుకోవడానికి ప్రత్యేక కారణముంది. అప్పట్లో అమలాపురంలోని దుకాణాలకు అవసరమైన సరకులను రాజమహేంద్రవరం వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది. గోదావరి నదులపై వంతెనల సౌకర్యం లేక జలమార్గం అంటే ప్రధాన పంట కాలువల ద్వారా లాంచీలు, పడవలపై సరుకుల రవాణా జరిగేది. ఆదివారం రాజమహేంద్రవరం వెళితే అక్కడ సెలవు.. అందుకే ఇక్కడి వ్యాపారులు అమలాపురంలో మంగళవారం సెలవుగా ప్రకటించుకుని ఆ రోజు దుకాణాలు మూసేసి రాజమహేంద్రవరానికి సరుకుల ఖరీదుకు వెళ్లేవారు. అలా మంగళవారం సెలవు ఆనవాయితీగా మారిపోయింది.

## క్లుప్తంగా

### నిరంతర సాధనతోనే విజయాలు



అంబాజీపేటలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న హనుమంతరావు, అప్పలరాజు

**అంబాజీపేట:** క్రమశిక్షణతో పాటు నిరంతర సాధన చేయడం వల్ల విజయాలు వాటంతట అవే వస్తాయని బాస్కెట్‌బాల్ స్టేట్ సెలక్షన్ కమిటీ సభ్యుడు నడింపల్లి అప్పలరాజు, జిల్లా కామన్ పరీక్షల బోర్డు కార్యదర్శి బీర హనుమంతరావులు అన్నారు. అంబాజీపేట బాస్కెట్‌బాల్ క్లబ్ మొదటి వార్షికోత్సవ వేడుకను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు విజయం సాధించాలంటే ఫిట్‌నెస్ ఎంతో అవసరమన్నారు. అనంతరం బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు స్కిల్ లెవెల్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు కేకును కట్ చేసి క్రీడాకారులకు పంచారు. కార్యక్రమంలో పీఈటీలు అందె సూర్య కుమారి, రెడిపల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

### వైభవంగా వీరభద్రుని సంబరం



బి.దొడ్డవరంలో వీరభద్రస్వామి సంబరంలో పాల్గొన్న భక్తులు

**మామిడికుదురు:** బి.దొడ్డవరంలో బాలవీరభద్ర స్వామి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా ఉదయం స్వామి వారి మేలుకొలుపు, అనంతరం మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామి వారి ఊరేగింపు ఘనంగా జరిపించారు. పినిశెట్టి వెంకటస్వామి సోదరుల ఆధ్వర్యంలో ఈ పూజలు ఏర్పాటు చేశారు. సంబరంలో భాగంగా పినిశెట్టి రాంబాబు నేతృత్వంలో వైనతేయ గోదావరి నదీస్నానం, శమీపూజ, ప్రభ ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామికి అష్టోత్తర పూజ వైభవంగా జరిపించారు. శూలాల సంబరం నిర్వహించారు. వీరభద్రస్వామి భక్తులు 60 గజాల నిప్పులగుండం తొక్కారు. బుధవారం కలశ స్థాపనతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు అయిదు రోజుల పాటు ఘనంగా జరిగిన తర్వాత నిప్పులగుండంతో సంపూర్ణమయ్యాయి.

### క్రీడాసామగ్రి అందించిన పూర్వ విద్యార్థి



క్రీడాసామగ్రిని హెచ్‌ఎంకు అందజేస్తున్న పూర్వ విద్యార్థి చిన్నికృష్ణ

**మామిడికుదురు:** మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1966 నుంచి 1971 వరకు చదువుకున్న విద్యార్థులు సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న రోజుల నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థి కాశిన వీరభద్రానంద చిన్నికృష్ణ క్రీడా సామగ్రి కొనుగోలు నిమిత్తం పాఠశాలకు రూ.10 వేలు నగదు అందించారు. దీంతో కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిని హెచ్‌ఎం టీఎస్‌కేడీ ప్రసాదరావుకు చిన్నికృష్ణ అందజేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కొల్లాబత్తుల మధువాసన్, పీఈటీ పి.పాపన్న, స్కూల్ సెక్రటరీ శ్రీపాద వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు సుబ్బరాజు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి సాయం అందిస్తున్న యర్రంశెట్టి గ్రూప్ సభ్యులు

**పి.గన్నవరం:** మండలంలోని యర్రంశెట్టివారి పాలెంలో గత డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో యర్రంశెట్టి నాగేశ్వరరావు మరణించగా, అతని కుటుంబ సభ్యులకు యర్రంశెట్టి, యర్రంశెట్టి గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.లక్షను బాండ్ల రూపంలో అందజేశారు. అదే ప్రమాదంలో గాయపడి కోలుకున్న యర్రంశెట్టి వెంకటస్వామినాయుడుకు రూ.11 వేల సాయం అందించారు. కార్యక్రమంలో యర్రంశెట్టి గ్రూప్ సభ్యులు యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, వీరబాబు, వీరాస్వామి, శ్రీరామారావు, వీరాస్వామి నాయుడు, వెంకటరమణ, రాంబాబు, మాజీ సర్పంచ్ సిద్దిరెడ్డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీనృసింహుని సన్నిధిలో కలెక్టర్లు, సబ్‌కలెక్టర్



అంతర్వేది ఆలయంలో కలెక్టర్‌లు, సబ్‌కలెక్టర్

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, సబ్ కలెక్టర్ సూర్యతేజ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కుటుంబ సభ్యులతో కలసి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద కలెక్టర్‌లు, సబ్‌కలెక్టర్‌కు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు చెప్పి, తీర్థప్రసాదాన్ని అందజేశారు. స్వామివారి చిత్రపటాలను సూపరింటెండెంట్ విజయసారథి అందజేశారు.

### ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



సత్తెమ్మ అమ్మవారిని అభిషేకిస్తున్న పండితులు

**కొత్తపేట:** స్థానిక మారుతీ సెంటర్ సమీపాన వేంచేసిన సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏపూరి నరసన్న, అంగ్రోతు వెంకన్నబాబు, చిరంజీవిరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అమ్మవారికి వేదపండితులు పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామ ఆడపడుచులు, మహిళలతో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి కథ చెప్పించారు. కార్యక్రమాల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సోమవారం పంచరంగులతో అమ్మవారి అలంకరణ, గ్రామోత్సవం, అనంతరం అన్నసమారాధన జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

### పెద్దింట్లమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు



పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ

**సఖినేటిపల్లి:** మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో వేంచేసిన పెద్దింట్లమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. గ్రామస్తులతో పాటు వేర్వేరు ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 21 నుంచి ఆలయ కమిటీ ఉత్సవాలు ప్రారంభించింది. ఉదయం నుంచి రాజోలు దీవిలోని వేర్వేరు ప్రాంతాల నుంచి కేశవదాసుపాలెం వెళ్లే మార్గాలు రద్దీగా మారాయి. సుమారు నెల రోజుల పాటు జరగనున్న ఈ మహోత్సవాలల్లో ప్రధానంగా తాగునీటి సౌకర్యం, భక్తులు సేదదీరేందుకు షామియానాలతో పందిళ్లు నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

### నూకాంబిక అమ్మవారి గ్రామోత్సవం

**ఆలమూరు:** గ్రామంలో ఆదివారం నూకాంబిక అమ్మవారికి వైభవంగా గ్రామోత్సవం జరిగింది. చింతలూరు గ్రామదేవత నూకాంబిక అమ్మవారు బుట్టగరగ రూపంలో ఆరో రోజు గ్రామంలో ఇంటింటికీ దర్శనమిచ్చింది. బుట్టగరగను నెత్తిన ధరించిన ఆలయ అర్చకుల పాదాలను మహిళ భక్తులు పసుపు నీళ్లతో కడిగి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలను అందజేశారు. మొక్కులు తీర్చుకుని హారతులు పట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే అమ్మవారి ఆలయాన్ని అనేక మంది భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ప్రధానార్చకుడు

**అయినవిల్లి:** స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో విజయవాడకు చెందిన టీవీడీఎస్‌వీ ప్రసాద్ ఆదివారం రూ.10,116ల విరాళం అందజేశారు. ఈ సొమ్మును ప్రధానార్చకుడు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

### నేడు స్పందన

**మామిడికుదురు:** జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన గ్రీవెన్స్ సెల్ జరుగుతుందని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే గ్రీవెన్స్ సెల్‌కు విధిగా అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.